క్లుప్తంగా

పారిశుద్ధ్యంపై శ్రద్ధ వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఎం. శ్యామల

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పురపాలక సంఘ కార్యాలయం నందు కమిషనర్ ఎమ్. శ్యామల పారిశుద్ధ్యం పై రివ్యూ కార్యక్రమం నిర్వహించారు. రానున్న వర్షాకాలం లోపు పట్టణంలోని ప్రధాన డ్రైయిన్లను పూడిక తీయించడానికి తగు ప్రణాళికతో సిద్ధం కావాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రధాన డ్రైయినేజీలను పూడిక తీయడానికి కాంట్రాక్టులు పిలవాలన్నారు. మధ్యస్థ డ్రైయిన్‌లను పూడిక తీయడానికి పురపాలక సంఘంలో అందుబాటులో ఉన్న యంత్రాలను ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు గురక వ్యాధి నివారణ టీకాలు



వీధి పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలో పశువులకు పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో గురక వ్యాధి నివారణ టీకాలను వేసే కార్యక్రమాన్ని గురువారం డాక్టర్ జవర్‌హుస్సేన్ ప్రారంభించారు. మున్సిపల్ పరిధిలోని సుమారు 290 పశువులు ఉన్నాయని, వీటికి వారం రోజుల్లో టీకాలు పూర్తి చేస్తామన్నారు. అదే విధంగా పశువుల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారం రోజుల పాటు ఈ టీకాలు వేసే కార్యక్రమాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకుల కృషి అభినందనీయం



క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీ విజయానికి క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో నాయకులు, సభ్యులు విశేష కృషి చేశారని పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ మేడిది జాన్సన్ అన్నారు. భీమవరంలో వారిని శుక్రవారం అభినందించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేశారన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ సాధించే విజయంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుర్రం బెనహర్, డి.డేవిడ్ రాజు, బి.సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా రహదారి నిర్మాణ పనులు

మొగల్తూరు: మొగల్తూరు కడలివారి పాలెం నుంచి పెద్దపల్లవపాలెం వరకు నిర్మించేందుకు చేపట్టిన రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. నరసాపురం, సతారాంపురం, మొగల్తూరు మీదుగా జాతీయ రహదారి విస్తరించింది. దీనిలో భాగంగా మొగల్తూరు గ్రామంలోకి వెళ్లేందుకు స్థానిక ప్రధాన రహదారిని కూడా జాతీయ రహదారుల శాఖ విస్తరించాల్సి ఉంది. దీంతో మొగల్తూరులోని కడలివారిపాలెం నుంచి పాతకాలువ, రామాలయం సెంటర్, గాంధీ బొమ్మల సెంటర్, లాకు మీదుగా పెద్దపల్లవపాలెం వరకు రహదారి నిర్మించేందుకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ రూ.10 కోట్లు మంజూరు చేసింది. దీంతో మొగల్తూరు ప్రధాన రహదారి నిర్మించేందుకు పనులు చేపట్టామని పనుల పూర్తయిన తరువాత రాష్ట్ర ఆర్ అండ్‌బీ శాఖకు రహదారిని అప్పగించనున్నట్లు జాతీయ రహదారుల శాఖ డీఈ కిరణ్ కుమార్ తెలిపారు.

సీనియర్ సిటిజన్స్‌కు ప్రయాణ రాయితీ ఇవ్వాలి

పాలకొల్లు సెంట్రల్: భారతీయ రైల్వే శాఖ సీనియర్ సిటిజన్స్‌కు గతంలో టికెట్ పై రాయితీ ఇచ్చేవారని ఈ రాయితీని కేంద్ర ప్రభుత్వం గత కొంతకాలంగా నిలిపివేసిందని పాలకొల్లు సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు వంగా నరసింహారావు తెలిపారు. శుక్రవారం నరసింహారావు విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సీనియర్ సిటిజన్స్‌కు ఇచ్చే రాయితీపై ఒకసారి పునరాలోచన చేసి మళ్లీ పునరుద్ధరణ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పాలకొల్లు రైల్వే స్టేషన్లో త్వరగా లిఫ్ట్ సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే రెవెన్యూ, మునిసిపల్, బ్యాంకులు ఇలా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సీనియర్ సిటిజన్స్‌కు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు కుటుంబపరంగా వ్యక్తిగత సమస్యలు ఉంటే తనను సంప్రదించాలని వంగా నరసింహారావు కోరారు.

ముమ్మరంగా రబీ ధాన్యం కొనుగోళ్లు

- నియోజకవర్గంలో 85,318 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- మరో 1500 ఎకరాల్లో పూర్తికావలసిన మాసూళ్లు



యంత్రాలతో మాసూళ్లు చేస్తున్న దృశ్యం



చిలుకూరు వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో వ్యవసాయ శాఖ అధికారులు

ఆకివీడు: రబీ ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గత రెండు రోజులుగా వాతావరణ పరిస్థితులు అనుకూలించనప్పటికీ మాసూళ్లు చేసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద శాంపిల్స్ తీసి, ఆయా వాహనాల ద్వారా కేటాయించిన రైస్‌మిల్లులకు ధాన్యంను చేరవేస్తున్నారు. రబీ దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో ఉండి నియోజకవర్గంలోని ఆకివీడు, కాళ్ల, ఉండి, పాలకోడేరు మండలాల్లో 1,02,032 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించారు. దీంతో ఇప్పటి వరకూ నాలుగు మండలాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నుంచి 85,318 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. మరో పదిహేను వందల ఎకరాలల్లో పంట మాసూళ్లు చేయాల్సి ఉండటంతో అకాల వర్షాలకు కోతలు వెనక్కు వెళ్లాయి. మే 20 తేదీ నాటికి కోతలు పూర్తి అయి, మాసూళ్లు చేసి రైతులు గట్టెక్కే పరిస్థితి ఉంది.

నియోజకవర్గంలో 43 కొనుగోలు కేంద్రాలు

ఉండి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 43 ధాన్యం కొనుగోలు కేంద్రాల్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆయా సొసైటీల ఆధ్వర్యంలో కొనుగోలే కేంద్రాలు నడుస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక సిబ్బంది రైతులకు సత్వర సేవలందిస్తున్నారు. రైతులు తీసుకువచ్చిన శాంపిల్స్‌ను తక్షణం పరీక్షలు జరిపి, తేమ, ముక్కు, పసిరి తదితర వాటి శాతాన్ని తేల్చిచెప్పి, ఆన్‌లైన్‌లో చూపించిన విధంగా మిల్లులకు రైతుల ధాన్యాన్ని కేటాయిస్తున్నారు. మిల్లుల వద్ద కస్టోడిన్ అధికారి (వీఆర్వో) యాప్ ద్వారా నమోదు చేసకుని దిగుమతి చేస్తున్నారు.

ఆశాజనకంగా కొనుగోళ్లు



నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లు ఇప్పటి వరకూ వేగవంతంగా 88 శాతం పూర్తైంది. రైతులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం మిల్లుల వద్ద దిగుమతి అవుతున్నాయి. నియోజకవర్గంలో 1,02,032 మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం కాగా, ఇంత వరకూ 85,318 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. త్వరలోనే లక్ష్యాన్ని మించి సేకరణలు జరిగే అవకాశం ఉంది. –కె.ఎస్.ఎస్.శ్రీనివాసరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు, ఆకివీడు.

	ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం	సేకరణ	కేంద్రాలు.
ఆకివీడు	15,507	12,094	07
కాళ్ళ	12,807	10,311	09
ఉండి	35,975	33,357	15
పాలకోడేరు	37,743	29,556	12
మొత్తం	1,02,032	85,318	43

ఇంటి పన్ను వసూళ్లకు కసరత్తు

- ఈ ఏడాది రూ.1.80 కోట్లు వసూళ్లు లక్ష్యం
- గత ఏడాది బకాయిలు రూ. 55 లక్షలు

ఆకివీడు: నగర పంచాయతీలోని ఇళ్ల పన్ను వసూళ్లకు కసరత్తు ప్రారంభించినట్లు కమిషనర్ జీ.కృష్ణ మోహన్ శుక్రవారం చెప్పారు. ఈ ఏడాది రూ. 1.80 కోట్లు ఇళ్ల పన్ను వసూళ్లకు డిమాండ్ నోటీసులు సిద్ధం చేసినట్లు తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని ఐదు సచివాలయాలకు డిమాండ్ నోటీసులు పంపించామన్నారు. ఆయా సచివాలయ కార్యదర్శుల ద్వారా నోటీసులు ప్రజలకు అందజేస్తారని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకూ ఇంటి పన్ను డిమాండ్ నోటీసులు అందజేస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్, మే, జూన్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో వడ్డీ లేకుండానూ, మిగిలిన నెలల్లో వడ్డీతోనూ డిమాండ్ చెల్లించాల్సి ఉంటుందని కృష్ణమోహన్ వివరించారు. గత ఏడాది సుమారు రూ. 55 లక్షల మేర బకాయిలు వసూళ్లు చేయాల్సి ఉందని చెప్పారు. బకాయిదారులు వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇంటి పన్నుతో పాటు కుళాయి పన్ను చెల్లింపుకు కూడా డిమాండ్ రూపొందిస్తున్నామన్నారు. ఈ ఏడాది ప్రతీ కుళాయి కనెక్షన్‌కు నెలకు రూ. 100లు చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. గత ఏడాది కుళాయి పన్ను చెల్లించాల్సిన వారు తమ డిమాండ్‌తో నగర పంచాయతీ కార్యాలయం వద్ద చెల్లించాలని సూచించారు. ఇంటి పన్ను, కుళాయి పన్ను డిమాండ్‌లు అందుకున్న వారు నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌లో చెల్లించి రశీదు పొందాలన్నారు. డబ్బు చెల్లించిన ప్రతి ఇంటి యజమాని రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

కాయ్ రాజా కాయ్..!

- గ్రామాల్లో సర్వత్రా ఉత్కంఠ
- విజయంపై వైఎస్సార్ సీపీ వర్గీయుల ధీమా

వీరవాసరం: ఓ వైపు ఇండియన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగడంతో మ్యాచ్‌లపై బెట్టింగ్‌లు యథేచ్ఛగా సాగుతున్నాయి. మరోవైపు ఇండియన్ పొలిటికల్ లీగ్ తోడవడంతో బెట్టింగ్ రాయుళ్లకు పండగే పండగ. పట్టణం, పల్లెలు తేడా లేకుండా పందాలు జోరందుకున్నాయి. దాబాలు, రెస్టారెంట్లు, హోటళ్లు, అపార్ట్‌మెంట్లు వేదికగా క్రికెట్‌తో పాటు పొలిటికల్ బెట్టింగ్‌లు సాగుతున్నాయి. సగటున రూ.లక్షలు పందం కాస్తుండగా మొత్తంగా కలిపి రూ. కోట్లకు చేరినట్లు తెలుస్తోంది. ఐపీఎల్ నాకౌట్ పోటీలతో పాటు ఎన్నికల ఫలితాలకు రోజులు దగ్గర పడుతున్న కొద్దీ ఈ బెట్టింగ్ విశ్వరూపం దాల్చే పరిస్థితి కనబడుతోంది. ఈ బెట్టింగ్‌లకు నగదుతో పాటు ఆస్తులు, వాహనాలు, బంగారు ఆభరణాలు, సెల్ ఫోన్లు కూడా పెడుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రచారం, పోలింగ్ పూర్తి కావడంతో ప్రజల చూపంత జూన్ 4న వెలువడే ఎన్నికల కౌంటింగ్ పై దృష్టి పెట్టారు. సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీ గెలుపొందుతుంది.. ఏ అభ్యర్థి విజయం సాధిస్తాడు అనే అంశాలతో సర్వత్ర ఉత్కంఠంగా ఎదురుచూస్తున్నారు. ఇదే సమయంలో పందాల రాయుళ్లు అభ్యర్థుల గెలిపోటములపై పెద్ద ఎత్తున పందాలకు తెగబడుతున్నారు. కాయ రాజా కాయ్ అంటూ బెట్టింగ్ వేస్తున్నారు. ముఖ్యంగా వైఎస్సార్ సీపీ తిరిగి అధికారం చేజిక్కించుకుంటుందని, అత్యధిక మెజారీతో పులివెందులలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జెండా ఎగరేస్తారని, అత్యధిక సీట్లను కైవసం చేసుకుని వైఎస్సార్ సీపీ అధికారం నిలబెట్టుకుంటుందని పెద్ద ఎత్తున పందాలు జరుగుతున్నాయి. దేశంలో ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ అవుతారు కానీ బిజెపికి 400 సీట్లు రావని, తెలంగాణలో అత్యధిక ఎంపీ సీట్లు బీజేపీ సాధిస్తుందని, తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సాధించే ఎంపీ సీట్లను పై కూడా పందాలు సాగుతున్నాయి .ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అత్యధిక సీట్లు వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంటుందని బెట్టింగ్లు జోరుగా సాగుతున్నాయి. నరసాపురం పార్లమెంట్ పరిధిలో అధిక స్థానాల్లో వైఎస్సార్ సీపీ విజయ బావుటా ఎగరేస్తుందని పందాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ఉండి, ఆచంట నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు విజయం సాధిస్తారని ఒకటికి రెండు రెట్లు ఇచ్చి మరి పందాలు కాస్తున్నారు. జిల్లా కేంద్రమైన భీమవరం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి విజయ బావుటా ఎగరేస్తారని పెద్ద ఎత్తున బెట్టింగులు సాగుతున్నాయి. ఎన్నికల ముందు వరకు హడావుడి చేసిన ఉమ్మడి కూటమి అభ్యర్థులు గెలుస్తారు అన్న పందాలు పోలింగ్ పూర్తైన తర్వాత ఎక్కడ కానరావడం లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు రోజుల క్రితం ఇచ్చిన స్టేట్మెంట్తో ఉమ్మడి కూటమి అభ్యర్థులు చతికిలబడ్డారు. ఎన్నికల పోలింగ్ ముందు రోజు వరకు హడావుడి చేసిన ఉమ్మడి కూటమి అభ్యర్థుల తరపున బెట్టింగ్ రాయుళ్లు పోలింగ్ అనంతరం పందాలు కాయడానికి ముఖం చాటేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు భీమవరం కూటమి అభ్యర్థిపై పందాలకు హడావుడి చేసిన పందాల రాయుళ్లు నేడు పందాల మాటే ఎత్తకపోవడం ఆశ్చర్యకరంగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు .ఏది ఏమైనా ఇప్పటికే పెద్ద ఎత్తున ప్రభుత్వం ఏర్పాటు ,ఎంపీ ,ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు ఓటములపై కోట్లాది రూపాయల బెట్టింగు జరిగి ఉంటుందని బెట్టింగ్ రాయుళ్లు ఆర్భాటంగా పేర్కొంటున్నారు.

కోసు పందాలు...

రాజకీయ బెట్టింగ్ విషయానికి వస్తే వివిధ పార్టీల అభ్యర్థులు విజయం సాధిస్తారని.. అదే సమయంలో వారికి వచ్చే మెజారిటీపై కూడా పందాలు నడుస్తున్నాయి. ప్రస్తుతానికి ఎన్నికల ఫలితాలకు దాదాపు 20 రోజులు సమయం ఉన్నందున ప్రాథమికంగా రూ. లక్షల్లో పందాలు కడుతున్నారు. ఫలితాల రోజు దగ్గర పడుతున్న కొద్దీ బెట్టింగ్‌లు ఘణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. పొలిటికల్ బెట్టింగ్ విషయంలో పందెంరాయుళ్లు సర్వేలను కూడా ఆధారం చేసుకుంటున్నారు. మొత్తానికి రానున్న మూడు వారాల పాటు బెట్టింగ్ వ్యవహారం జోరుగా సాగనుంది. అయితే ఈ మాయా జూదానికి పోలీసులు అడ్డుకట్ట వేయాల్సి ఉందని పలువురు భావిస్తున్నారు.

ఆరోగ్య సురక్షను వినియోగించుకోండి



పాములపర్రు ఆరోగ్య సురక్షలో రోగులను పరీక్షిస్తున్న వైద్య బృందం

ఉండి: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని యండగండి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ పీ లక్ష్మీసునంద అన్నారు. శుక్రవారం మండలంలోని పాములపర్రు గ్రామంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించగా సుమారు 450 మంది రోగులు ఈ శిబిరంలో వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. వైద్య శిబిరాల్లో వైద్య సేవలు అన్నీ పూర్తిగా ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాల్లో వైద్య పరీక్షలు చేసి రోగులకు కావలసిన తగిన మందులను ఉచితంగా అందజేయడంతో పాటు రోగికి కావలసిన వైద్య సేవలను వైద్య సిబ్బంది అందజేయడం జరుగుతుందన్నారు. చిన్న పిల్లలకు, గర్భిణులు, బాలింతలతో పాటు పలు దీర్ఘకాలిక రోగాలకు కూడా ఈ శిబిరాలల్లో వైద్యం అందజేయడం జరుగుతుందని తెలిపారు. అందుకే ఆరోగ్యం పట్ల అందరికీ అవగాహన ఉండాలని డబ్బు ఖర్చు లేకుండా నేరుగా గ్రామాల్లోనే ప్రభుత్వం ఉచిత వైద్యాన్ని అందిస్తుంది కనుక అందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు వర్రే పైడియ్య, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు తాటిపట్టి పెదవీరప్ప, మాజీ సర్పంచ్ నక్కా చెన్నకేశవ, డాక్టర్ కే సత్యానంద్, డాక్టర్ కే వెంకటగుణ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన




కోమటితిప్పలో కూలీల మస్తర్‌ను పరిశీలిస్తున్న జేఈ ఆనంద్

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. వ్యవసాయపనులు అంతంత మాత్రంగా ఉండటంతో ఉపాధి కూలీలు, పంటబోదెల తవ్వకాలకు ప్రాధాన్యమిస్తున్నారు. మండలంలో భారీ మంచి నీటి చెరువులు ఉన్న ప్రాంతాలలో పూర్తి స్థాయిలో మంచినీటి చెరువులు తవ్వేందుకు పనులుచేపట్టారు. మొగల్తూరు, కేపీ పాలెంలోని పంటబోదెల నుంచి మంచినీటి చెరువులకు వెళ్ళే పనులు పూర్తికావచ్చాయి. శుక్రవారం కాళీప్నటం మంచి నీటి చెరువులోకి నీరు వెళ్లేందుకు కోమటి తిప్పలో పంట బోదె తవ్వకం పనులు చేపట్టారు. దీంతో జేఈ ఆనంద్ కూలీల మస్తర్‌ను పరిశీలించి కూలీలకు పలు సూచనలు చేశారు.

ఘనంగా ప్రారంభమైన తిరు కల్యాణ మహోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో కాళ్ళకూరు వెంకటేశ్వర స్వామి



ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ కాంతులు

కాళ్ల: కాళ్ల మండలం కాళ్ళకూరు గ్రామంలో స్వయంభు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కల్యాణ మహోత్సవంలో భాగంగా సాయంత్రం 6 గంటలకు మంగళ వాయిద్యాలు నడుమ విశ్వక్సేన ఆరాధన, భగవత్ పుణ్యావాచనం నిర్వహించారు. శ్రీ స్వామి అమ్మవార్లకు అష్టోత్తర శత (కమల)తామర పుష్ప పూజ, మృత్ సంగ్రహణం, అంకురారోపణ, ధ్వజారోహణ, దీక్ష ధారణ, నిరాజన మంత్రపుష్ప తీర్థ ప్రసాద వినియోగము ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ధ్వజారోహణ సందర్భంగా సంతానం లేని దంపతులు సంతానం కొరకు శ్రీ స్వామివారి గరుడ పొంగలి విశేష ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. అరుణ్ కుమార్, దేవస్థానం సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

ప్రతి ఒక్కరూ క్రీస్తు ఉపదేశాలు అనుసరించాలి

ఉండి: ఉండి మండలం పాందువ్వలోని లూథరన్ చర్చ్ వార్షికోత్సవ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పేరిష్ పాస్టర్ రెవరెండ్ సీహెచ్ చింతారావు అధ్యక్షతన సంఘ ఆధ్వర్యంలో మూడు రోజుల సువార్త సభలను నిర్వహించారు. ఈ సభల్లో బ్రదర్ ఎం శ్రీనివాసరావు, బ్రదర్ పాల్‌విశ్వాస్(రాజమహేంద్రవరం), డాక్టర్ ఉపేంద్ర(ఖమ్మం) నుంచి హాజరై వాక్యసందేశమిచ్చారు. అనంతరం శుక్రవారం మొదటి వార్షికోత్సవ ప్రత్యేక ప్రార్థనలు చర్చ్‌లో నిర్వహించారు.సంఘ సీఆర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ ప్రార్థనల్లో పేరిష్ పాస్టర్ వాక్య సందేశమిచ్చారు. ఆయన మాట్లాడుతూ దేవుడు మనకు ఇచ్చిన ఈ జీవితాన్ని మంచి చేయడానికి వినియోగించాలన్నారు. దేవుడు చెప్పినట్టు క్రైస్తవులంతా పరోపకారులుగా ఉండి ఆయన మాటలు పాటించి జీవించాలన్నారు. క్రైస్తవ జీవితం చెడును మంచిగా మార్చిదని ప్రతీ ఒక్కరూ క్రీస్తు ఉపదేశాలు అనుసరిస్తే జీవితం మారి గొప్పవారు అవుతారన్నారు. సంఘ సీఆర్ కే భూషణం, పీసీసీ గొల్లపల్లి యోహాను, సంఘ పెద్దలు గొంతే హరీష్, మాదాసి నరేష్, గొల్లపల్లి యోహాను తదితరులు పాల్గొన్నారు.

ఆచూకీ తెలిస్తే చెప్పండి



గుర్తు తెలియని మృదేహం

ఉండి: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని ఆచూకీ తెలిసిన వారు తమకు తెలియజేయాలని ఎస్సై ఎం లక్ష్మణ్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 11వ తేదీన ఉండి సీతారామపేటలోని ఆంజనేయస్వామి గుడి ప్రక్కన ఓ గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన వీఆర్వో కూర్మా మరియమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో స్థానికుల సహాయంతో 108 ద్వారా పోలీసులు అతనిని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే అతడు చికిత్స పొందుతూ 15వ తేదీ మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో మృతి చెందాడు. మృతుని వయస్సు సుమారు 50 నుంచి 55ఏళ్ల ఉండవచ్చునని పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసినట్లు, ఇతని ఆచూకీ తెలిసిన వారు ఎస్సై 9440796648, పోలీస్‌స్టేషన్ 9154875653 నంబర్లలో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

రక్తపోటును నియంత్రించుకోవాలి



పెదకాపవరం గ్రామంలో ప్రపంచ రక్తపోటు దితనోత్సవం సందర్భంగా అవగాహనా ర్యాలీ



ఆకివీడు పీహెచ్‌సీలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

ఆకివీడు: రక్త ప్రచరణలో హెచ్చతగ్గుల వల్లే రక్తపోటు(బీపీ) వస్తుందని, దీనిని నియంత్రించుకుంటూ వెళ్లడం ద్వారా ఆరోగ్య పరిస్థితిని మెరుగు పరచుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు బీ. రాజశేఖర్ చెప్పారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని పెకాపవరం గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమస్యల్లో రక్తపోటు సర్వసాధారణమై పోయిందన్నారు. 30–35 సంవత్సరాలు పైబడిన వారందరూ రక్త పరీక్షలు చేయించుకుంటూ రక్తపోటు(బీపీ)ను నియంత్రించుకోవాలన్నారు. ఆకివీడు పీహెచ్‌సీ డా.ఎం.డి నిజరిన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వైద్యుల సూచనలు పాటించాలన్నారు. ఉప్పు వాడకం తగ్గించడం , క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. అధిక రక్తపోటు వల్ల గుండెపోటు, కిడ్నీ సమస్యలు తదితర ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఎప్పటికప్పుడు బీపీ పరీక్షలు చేయించుకుని తగిన మందుల్ని డాక్టర్ సలహాపై నిరంతరం వాడాలన్నారు. వ్యాధిపై అవగాహన కల్పించేందుకే ప్రపంచ హైపర్‌టెన్షన్ డేను మే 17వ తేదీన ప్రకటించిందని రాజశేఖర్ చెప్పారు. ధూమపానం, మానసిక వత్తిడి తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ కె.ప్రసాద్, ఎంపీహెచ్ఈఓ జుత్తిగ సత్యనారాయణ, పీహెచ్‌ఎన్, హెల్త్ సూపర్ వైజర్లు, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.